## కేజీబీవీని తనిఖీ చేసిన తహశీల్దార్



**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ గ్రామపంచాయతీ పరిధిలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని తాండూర్ తహశీల్దార్ యు.జ్యోత్స్న సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేజీబీవీలోని వంటశాలను సందర్శించి విద్యార్థినులకు వండిన ఆహారాన్ని పరిశీలించారు. అనంతరం వంటకాలను రుచి చూశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ విద్యార్థినులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించాలని సిబ్బందికి సూచించారు. ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కేజీబీవీని సందర్శించినట్లు తెలిపారు. ఆమె వెంట డిప్యూటీ తహశీల్దార్ జె.కల్పన, కేజీబీవీ ఎస్ఓ జె.కవిత, కేజీబీవీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల్లో గెలుపోటములు సహజమే



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** క్రీడల్లో గెలుపోటములు సహజమేనని సర్పంచ్ వేనపల్లి స్రవంతి సుధాకర్ అన్నారు. దహెగాం మండలం బోర్లకుంట గ్రామపంచాయతీ పరిధిలోని రాళ్లగూడ గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నిమెంట్ ముగింపు కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టోర్నిమెంట్లో విజయం సాధించిన జట్లకు ఉప సర్పంచ్ తిరుపతితో కలిసి బహుమతులు ప్రదానం చేశారు. టోర్నిమెంట్లో రాళ్లగూడ జట్టు మొదటి బహుమతిని గెలుచుకోగా, ఇట్యాల జట్టు రెండవ బహుమతిని సాధించింది. అనంతరం వారు మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు స్నేహభావం పెంపొందుతుందని తెలిపారు. యువత చదువుతో పాటు క్రడల్లోనూ రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సంజీవ్ సాగర్, కృష్ణంరాజు, శ్రీకాంత్, చిరంజీవి, గోపి, సాయికృష్ణ, భాస్కర్, మాజీ సర్పంచ్ మధుకర్, ఇట్యాల సర్పంచ్ జయలక్ష్మి , గజ్జల సురేష్, ఉప సర్పంచ్ శ్రీనివాస్, సీఐ కుమారస్వామి, దహెగాం ఎస్సై రమేష్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షులు దందెర మల్లేష్, మోరె సాయిప్రకాష్, గ్రామ పెద్దలు చౌదరి విలాస్, వడ్డేటి సాయి, భీమన్కర్ రవి, వగాడే బాపురావు, భీమన్కర్ రమేష్, రౌతు పత్రు, ఓడ్డేటి వెంకటేష్, భీమన్కర్ నానాయ్య, పాలే నానాజీ, సపుతే నారాయణ, గాండ్ల రవి, భీమన్కర్ మోహన్, వగాడే సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## పూలే విగ్రహ ఆవిష్కరణ కరపత్రాల విడుదల



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** వాంకిడి మండలం నర్లపూర్ గ్రామంలో మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఈనెల 25న నిర్వహించనున్న నేపథ్యంలో సోమవారం కోస్ని గ్రామంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాలి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లేండుగురే శ్యాంరావు చేతుల మీదుగా కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి మాలిలు, సంఘ నాయకులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాంకిడి మండల అధ్యక్షులు వడై బాబురావు, మండల జనరల్ సెక్రటరీ వస్తాకే హనుమంతు, ముండోర్ వెంకటేష్ తదితర మాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ కూలీలకు మజ్జిగ పంపిణీ



**ఉద్యమ కెరటం, తాండూర్:** మండలంలోని రాజీవ్ నగర్ గ్రామపంచాయతీ పరిధిలో కొనసాగుతున్న ఉపాధిహామీ పనుల్లో పాల్గొంటున్న కార్మికులకు ఎండల తీవ్రత నుంచి ఉపశమనం కల్పించేందుకు సోమవారం తాండూర్ ఎంపీడీఓ శ్రీనివాస్, సర్పంచ్ మామిడాల లలిత–రాజేశం బిస్కెట్లు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. మండుతున్న ఎండల్లో పనిచేస్తున్న కార్మికులు వడదెబ్బకు గురికాకుండా ఉండాలని, తరచూ నీరు, మజ్జిగ తీసుకుంటూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఈ సందర్భంగా ఎంపీడీఓ సూచించారు. ప్రభుత్వం ఉపాధిహామీ కార్మికుల ఆరోగ్య రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, ముఖ్యంగా మధ్యాహ్నం వేళల్లో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కాపర్తి సుభాష్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల దాహార్తి తీర్చే చలివేంద్రాలు అవసరం

- ములుగు పోలీస్ హెడ్ క్వార్టర్స్లో చలివేంద్రం ప్రారంభించిన మంత్రి




**ఉద్యమ కెరటం, ములుగు:** వేసవిలో ప్రజల దాహార్తి తీర్చే చలివేంద్రాలు ఎంతో అవసరమని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. ములుగు జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్లో ములుగు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ వేసవి కాలంలో ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ములుగు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వార్డులు, ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. పోలీస్ హెడ్ క్వార్టర్స్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందితో పాటు అక్కడికి వచ్చే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున ప్రజలు అత్యవసర పనులు ఉంటే తప్పా ఇంటి నుంచి బయటకు రావద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ములుగు మున్సిపాలిటీ చైర్మన్ చింతనిప్పుల చంద్రకళ బిక్షపతి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, కిసాన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, మున్సిపాలిటీ కమిషనర్ రమేష్, ములుగు ఎస్సై ఉపేందర్ రావు, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయాలు సామాజిక ఐక్యతకు ప్రతీకలు

- వెంకటాపూర్లో పెద్దమ్మ గుడి శంకుస్థాపన చేసిన మంత్రి సీతక్క



**ఉద్యమ కెరటం, ములుగు:** దేవాలయాలు సామాజిక ఐక్యతకు ప్రతీకలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి దనసరి అనసూయ సీతక్క అన్నారు. వెంకటాపూర్ మండలంలో పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.30 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న పెద్దమ్మ గుడి నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పూజలు నిర్వహించి ఆలయ నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో దేవాలయాల అభివృద్ధి ద్వారా ఆధ్యాత్మిక వాతావరణం మరింత బలపడుతుందని అన్నారు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికీ ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మామిడిశెట్టి సుగుణ స్వామి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, పంచాయతీరాజ్ శాఖ స్టేట్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు చెన్నోజు సూర్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ బండి శ్రీను, గ్రామ కమిటీ అధ్యక్షుడు చెన్నోజు శ్రీను, ఎన్ఎస్యూఐ జిల్లా అధ్యక్షుడు మామిడిశెట్టి కోటి, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, యువ నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకత్వం అవసరం



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు మార్గదర్శకత్వం ఎంతో అవసరమని కౌటాల ఎస్సై చంద్రశేఖర్ అన్నారు. కౌటాల మండల కేంద్రంలో జన భవిత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాలీసెట్ ఉచిత కోచింగ్ సెంటర్ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ వ్యవస్థాపకులు చంద్రశేఖర్ జాడే సమాజ సేవలో చూపుతున్న ఉదారత, సేవాభావం అభినందనీయమని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల భవిష్యత్తు కోసం ఇలాంటి ఉచిత కోచింగ్ సెంటర్లు ఎంతో దోహద పడతాయని పేర్కొన్నారు. జేబీసీటీ, మాటా సంస్థలు విద్యా రంగంలో చేస్తున్న సేవలను ప్రశంసించారు. అనంతరం చింతల మానేపల్లి మండల ఎంఈఓ పసాల జయరాజ్ పాలీసెట్ పరీక్ష ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. సరైన మార్గదర్శకత్వం, క్రమ శిక్షణతో చదివితే మంచి ర్యాంకులు సాధించవచ్చని సూచించారు. ఈ సందర్భంగా జేబీసీటీ అధ్యక్షుడు డి.సురేష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే తమ ట్రస్ట్ లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కూలీల సమస్యలు పరిష్కరించాలి



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండలంలోని బొరిగాం గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్ఈజీఎస్) కింద జరుగుతున్న పనులను సోమవారం అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామ పరిధిలో కొనసాగుతున్న పనులను పర్యవేక్షిస్తూ మస్టర్ రోల్స్ను తనిఖీ చేశారు. పనుల నాణ్యత, కూలీల హాజరు, పనుల పురోగతిని సమగ్రంగా పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. అర్హులైన ప్రతిఒక్కరికీ ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని, అమలులో పారదర్శకత పాటిస్తూ కూలీలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. పనుల పరిశీలన అనంతరం కూలీలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో పని ప్రదేశాల్లో నీడ కోసం చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. గత కొన్ని వారాలుగా పెండింగ్లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలీ రేటును పెంచాలని డిమాండ్ చేశారు. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందిస్తూ పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పెండింగ్ వేతనాల చెల్లింపు ప్రక్రియను వేగవంతం చేసి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ వసంతరావు, ఫీల్డ్ అసిస్టెంట్ విజయ్ కుమార్, ఈసీ కరీం, టీఏ లక్ష్మణ్, గ్రామస్తులు రాథోడ్ లాలాసింగ్, గులాబ్ సింగ్, జాదవ్ నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం



**ఉద్యమ కెరటం, సోనాల:** పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ అన్నారు. సోనాల మండలంలోని సాకేరా గ్రామంలో సోమవారం పర్యటించారు. గ్రామానికి చేరుకున్న ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి ఎద్దడి, గృహ నిర్మాణాల్లో ఎదురవుతున్న సాంకేతిక ఇబ్బందులను మహిళలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆడే గజేందర్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకోవడానికే గ్రామాలకు వస్తున్నానని తెలిపారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. లబ్ధిదారుల ఇళ్లలో పూజా కార్యక్రమాలు నిర్వహించి వారికి శుభా కాంక్షలు తెలిపారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పేదల పక్షాన నిలుస్తుందని, ప్రతి కుటుంబానికి న్యాయం చేయడమే తమ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ద్వారా పేదలకు ఆత్మగౌరవంతో కూడిన నివాసం కల్పించడం సంతోషకరమని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఇంద్రవెల్లిలో భావోద్వేగ క్షణాలు

- 45 ఏళ్ల తర్వాత స్వేచ్ఛగా అమరులకు నివాళి



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఇంద్రవెల్లి అమరవీరుల స్మృతివనంలో సోమవారం ఆదివాసీల ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించేలా స్మారక వేడుకలు ఘనంగా నిర్వహించారు. దాదాపు 45 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం ఎలాంటి ఆంక్షలు లేకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో గిరిజనులు అమరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్మృతివనం గిరిజనుల రాకతో జనసందోహంగా మారింది. ఈ కార్యక్రమానికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాజీ ఎంపీ సోయం బాపూరావ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఆసిఫాబాద్ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆత్రం సుగుణలతో కలిసి అమరవీరుల స్థూపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి జెండాను ఆవిష్కరించారు. అనంతరం అమరుల త్యాగాలను స్మరిస్తూ పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అమరుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. స్మృతివనం చుట్టూ కాంపౌండ్ వాల్, సోలార్ విద్యుత్, బోర్వెల్ సౌకర్యాలు కల్పించామని, మరో రూ.15 లక్షలతో వనాన్ని మరింత అభివృద్ధి చేస్తామని అన్నారు. ఆర్వోఎఫ్ఆర్ ద్వారా గిరిజనులకు భూహక్కులు కల్పించామని, ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. ఏజెన్సీ ప్రాంతాల్లో త్రీఫేజ్ విద్యుత్, తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు ఐటీడీఏ, అటవీ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆత్రం భుజేంద్రరావు రచించిన "ఆ గాయానికి 44 ఏళ్లు"అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ గిరిజనులు ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకోవాలని, ముఖ్యంగా ఆడపిల్లల విద్యపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. పోలీస్ సభల ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఐటీడీఏ పీఓ యువరాజ్ మర్మాట్ మాట్లాడుతూ స్మృతివన అభివృద్ధి పనులను మూడు నెలల్లో పూర్తి చేస్తామని, తాగునీటి సమస్య ఉన్న గ్రామాల్లో కొత్త బోర్లు, బావుల మంజూరుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు, గ్రామ పటేళ్లు, సార్మేడీలు, భారీ సంఖ్యలో గిరిజన ప్రజలు పాల్గొన్నారు.

# రైతుల సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలి

- తల్లాడలో తెలంగాణ రైతు సంఘం ఖమ్మం జిల్లా తృతీయ మహాసభలు



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని తెలంగాణ రైతు సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఆ సంఘం ఖమ్మం జిల్లా తృతీయ మహాసభలు సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని తల్లాడ మండల కేంద్రంలోని వాసవి కళ్యాణ మండపం, సామినేని రామారావు నగర్లోని కాసాని ఐలయ్య ప్రాంగణంలో త్వరలో జరగనున్నందున సోమవారం నిర్వహించిన సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, సీనియర్ నాయకులు తాతా భాస్కరరావు లు మాట్లాడారు. జిల్లాలో రైతులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, భూభారతి పోర్టల్ లో లోపాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. భూమి కలిగిన ప్రతి రైతుకు పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు సీతారామ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి, రూ.9వేల కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలకు మరమ్మతులు చేపట్టి, రైతులకు సాగునీరు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కౌలు రైతులను గుర్తించి 2011 సాగుదారు చట్టం ప్రకారం గుర్తింపు కార్డులు జారీ చేసి, బ్యాంకు రుణాలు, పంట అమ్మకాలు, ఎరువుల సబ్సిడీలలో వాటిని ప్రామాణికంగా తీసుకోవాలని సూచించారు. గ్రామ సభలు నిర్వహించి కౌలుదారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న విత్తన చట్టం, విద్యుత్ సంస్థల మార్కెట్ ముసాయిదా బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తూ మహాసభల్లో రైతుల సమస్యలపై చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శీలం సత్యనారాయణ రెడ్డి, నల్లమోతు మోహన్ రావు, కళ్యాణపు కృష్ణయ్య, గుంటుపల్లి వెంకటయ్య, సత్తెనపల్లి నరేష్, షేక్ మస్తాన్, గండమల ఆనందరావు, పెరసాని వెంకటయ్య, పులి వెంకట నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# మ్యాపింగ్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ చిత్రు**




**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఓటరు ప్రోజెని మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ చిత్రు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన ఓటరు మ్యాపింగ్పై అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఆయన అధికారులతో మాట్లాడుతూ ఓటరు ప్రోజెని మ్యాపింగ్ ప్రక్రియలో వేగం పెంచాలని సూచించారు. బిఎల్ఓలు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. నిర్ణీత గడువులోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో ఆర్డిఓ స్రవంతి, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అమరవీరుల త్యాగాలు మరువలేనివి

**డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** అమరవీరుల త్యాగాలు మరువలేనివని డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్ అన్నారు. ఇంద్రవెల్లి అమరవీరుల స్థూపం వద్ద సోమవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, మాజీ ఎంపీ సోయం బాపురావు, ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మీ తదితరులతో కలిసి అమరవీరుల స్మారకార్థం పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దశాబ్దాల క్రితం ఇంద్రవెల్లి గడ్డపై ఆదివాసీల హక్కుల కోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని కొనియాడారు. వారి ఆశయాల సాధనకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. ఆదివాసీల సంక్షేమం, జల్ జంగిల్ జమీన్ హక్కుల రక్షణ కోసం, పార్టీ నిరంతరం పోరాడుతుందని, వారి అభివృద్ధికి అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంద్రవెల్లి మార్కెట్ చైర్మన్ ఉత్తమ్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మల్యాల కరుణాకర్, జిల్లా నాయకులు యాకుబ్, జిల్లా కార్యదర్శి మెస్రం నాగ్నాథ్, సుకంట్ రావు, పోతన్న, దౌలత్ రావు, చంద్రశేఖర్, విశాల్, పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# కవి మధు భావల్కర్ కు అమెరికన్ యూనివర్సిటీ డాక్టరేట్




**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ప్రముఖ కవి, సాహితీవేత్త మధు భావల్కర్ అంతర్జాతీయ స్థాయి గౌరవ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. సాహితీ రంగంలో ఆయన చేసిన 55 ఏళ్ల సుదీర్ఘ కృషి, సామాజిక చైతన్యం కోసం అందిస్తున్న సేవలను గుర్తిస్తూ లూసియానా అమెరికన్ యూనివర్సిటీ ఈ గౌరవాన్ని ప్రకటించింది. ఆదివారం మహారాష్ట్ర పుణేలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రతినిధులు ఆయనకు ఈ పట్టాను అందజేశారు. మధు భావల్కర్ రాసిన కవితలు ప్రపంచ వ్యాప్తంగా 60 దేశాల్లో ప్రచురితం కాగా, ఆయన రాసిన 10 గ్రంథాలు విశేష ప్రాచుర్యం పొందాయి. బుద్ధుడు, అంబేద్కర్ ఆశయాలను తన రచనలు, ప్రసంగాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లినందుకు ఈ గుర్తింపు లభించింది. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ డైరెక్టర్లు డాక్టర్ అనిల్ కృష్ణ భరద్వాజ్, డాక్టర్ రమేష్ బినోనేకార్, మాజీ న్యాయమూర్తి శివదాస్ ప్రముఖులు పాల్గొని భావల్కర్ ను అభినందించారు. అణగారిన వర్గాల అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నందుకు ఈ గౌరవం దక్కిందని భావల్కర్ ఈ సందర్భంగా సంతోషం వ్యక్తం చేశారు.

## హక్ ఐ కేర్ ఆప్టికల్ సెంటర్ ప్రారంభం



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** కాగజ్నగర్ పట్టణంలోని నిఖిల్ మెడికల్ సమీపంలో ఏర్పాటు చేసిన హక్ ఐ కేర్ ఆప్టికల్ అండ్ విజన్ సెంటర్ ను జెడ్పి మాజీ ఛైర్మన్ కోనేరు కృష్ణారావు మున్సిపల్ వైస్ చైర్పర్సన్ డాక్టర్ అనితతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన కంటి పరీక్షా పరికరాలను పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన కంటి పరీక్షలు, ఆధునిక ఆప్టికల్ సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ సెంటర్ను ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, స్థానిక నాయకులు పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

## నీటి సమస్య పరిష్కారానికి కృషి



**ఉద్యమ కెరటం, తిర్యాణి:** నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఉపసర్పంచ్ చెని కుమార్ తెలిపారు. మండలంలోని తిర్యాణి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కారానికి చర్యలు చేపడతానని పేర్కొన్నారు. సోమవారం నాయకపుగూడ గ్రామంలో చెడిపోయిన నీటి పంపుకు మరమ్మతులు చేయించి ప్రజలకు తాగునీరు అందేలా చర్యలు తీసుకున్నారు. ఎండాకాలం కావడంతో తాగునీటి సమస్యలు ఏర్పడే అవకాశం ఉందని, గ్రామస్తులు సమస్యలను వెంటనే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు ఎడ్ల భాగ్య తిరుపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం



**ఉద్యమ కెరటం సత్తుపల్లి:** సత్తుపల్లి పట్టణంలోని సిద్ధారం రోడ్డు ఆటో స్టాండ్ వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించారు. రోజురోజుకు పెరుగుతున్న ఎండలతో ప్రయాణికులు తాగునీటి కోసం ఇబ్బంది పడకుండా సత్తుపల్లి పట్టణంలోని ఏఐటియుసి సిద్ధారం రోడ్ ఆటో స్టాండ్ వద్ద చలివేంద్రాన్ని ప్రముఖ వ్యాపారవేత్త పత్తి విశ్వేశ్వరరావు ఆర్థిక సహకారంతో సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మటూరి రామకృష్ణ, సత్తుపల్లి మార్కెట్ కమిటీ సభ్యులు వినుకొండ కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రజలకు మంచినీరు అందించారు. ఈ కార్యక్రమంలో సిద్ధారం రోడ్డు ఆటో ఓనర్ కం వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సిహెచ్ కాశి రావు, రాంబాబు, కోటయ్య వెంకట్, హరిబాబు, అర్జున్ రావు, రాము, పుల్లయ్య, సకుర్తి వెంకటేశ్వర్లు, పరస వెంకన్న, సత్తుపల్లి మండల కార్యదర్శి తెలగారపు రామారావు తదితరులు పాల్గొన్నారు.

## హై కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షునికి సన్మానం




**ఉద్యమ కెరటం,ఆదిలాబాద్:** బోథ్ మండలంలోని కౌట(బి) గ్రామానికి చెందిన సింగిడి సురేందర్ రెడ్డి ఇటీవల ఎన్నికల్లో తెలంగాణ హై కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా గెలుపొంది తొలి సారి ఆదిలాబాద్ జిల్లా కు వచ్చారు. ఈ సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని రెడ్డి హాస్టల్ లో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షులు నల్ల నారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులు, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి కలిసి ఆయనను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి గోపిడి రాం రెడ్డి, కార్యవర్గ సభ్యులు మంజుల రెడ్డి అడ్వకేట్, స్వామి రెడ్డి, పొద్దుటూరి నారాయణ రెడ్డి, భూమారెడ్డి, సవీన్ రెడ్డి, శివ ప్రసాద్ రెడ్డి, జలంధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వినాయక ఫర్టి లైజర్ షాపు ప్రారంభోత్సవం



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన వినాయక ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ దుకాణాన్ని సోమవారం ప్రారంభించారు. తలమడుగు మండలం లింగి గ్రామానికి చెందిన రాకేష్ ఈ నూతన వ్యాపార సంస్థను స్థాపించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయడం అభినందనీయమని అన్నారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని కోరారు. అనంతరం షాపు యజమాని రాకేష్కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ బోథ్ నియోజక వర్గ అధ్యక్షులు బద్దం పోతారెడ్డి, ఎన్ఎస్యూఐ నాయకులు సద్దాం పాల్గొన్నారు.

## వివాహ వేడుకకు హాజరైన డీసీసీ అధ్యక్షులు



**ఉద్యమ కెరటం, సాత్నాల:** సాత్నాల మండలం పాటగూడ గ్రామంలో సోమవారం జరిగిన కినక శ్యామరావు కుమారుని వివాహ మహోత్సవానికి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకుముందు గ్రామానికి చేరుకున్న ఆయనకు కినక శ్యామరావు కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. డీసీసీ అధ్యక్షుడిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంజీవ్ రెడ్డి, మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గంద్రత్ సుజాత, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్యాల కరుణాకర్, కార్యదర్శి ప్రభాకర్, జిల్లా నాయకులు దౌలత్ రావు, చంద్రశేఖర్, సాత్నాల మండల కాంగ్రెస్ నాయకులు సోయం తులసిరామ్, మాజీ ఎంపీటీసీ భూమన్న, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఇసుక వాహనాల తనిఖీ



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని పెద్దవాగు సమీపంలో జీపీఓ సరోజన సోమవారం ఇసుక వాహనాలను తనిఖీ చేశారు. ఆన్లైన్ నమోదు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకొని జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఇసుక రవాణా కోసం తప్పనిసరిగా "మన ఇసుక వాహనం"యాప్ ద్వారా ముందస్తుగా బుకింగ్ చేసుకోవాలని సూచించారు. అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు నిరంతర తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లా లోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, జిల్లా అదనపు కలెక్టర్ రాములుతో కలిసి అర్జిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. నెన్నెల మండలం నార్వాయిపేట గ్రామానికి చెందిన కైరత్ పాషా తమ తాతల నుంచి వారసత్వంగా వస్తున్న భూమిని కొందరు అక్రమంగా మార్చి పట్టా చేసుకున్నారని, విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని అర్జీ సమర్పించారు. మంచిర్యాల పట్టణానికి చెందిన సాయిని శ్రీనివాస్ తనకు హాజీపూర్ మండలం దొనబండ గ్రామ శివారులో గల భూమి వివరాలను భూ భారతి పోర్టల్ లో నవీకరించి పట్టా పాస్ పుస్తకం మంజూరు చేయాలని, తాండూర్ మండలం బోయపల్లి గ్రామానికి చెందిన ఎలిగేటి సాయికుమార్ తమ తాతల నుంచి వారసత్వంగా వస్తున్న భూమిని తమకు ఎలాంటి సమాచారం లేకుండా కొందరు విక్రయించారని, కన్నెపల్లి మండలం సాలిగాం గ్రామానికి చెందిన తాళ్లపల్లి నరేష్ తాను రిజిస్టర్ డాక్యుమెంట్ ద్వారా కొనుగోలు చేసిన భూమిని తన పేరిట ఆన్లైన్ లో నమోదు చేయాలని కోరుతూ అర్జీలు సమర్పించారు. దండేపల్లి మండల కేంద్రానికి చెందిన గుండా రవీందర్ తల్లితండ్రుల పోషణ చట్టం ప్రకారం ప్రభుత్వ ఉద్యోగి అయినా తన కుమారుని నుంచి ప్రతినెల నగదు ఇప్పించి ఆదుకోవాలని దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణానికి చెందిన కొత్త మాధవి, కొత్త కిరణ్ మానసిక దివ్యాంగులు అయిన తమకు పెన్షన్ ఇప్పించాలని అర్జీలు అందజేశారు. మంచిర్యాల పట్టణం తిలక్ నగర్ కు చెందిన లింగన్నపేట సత్యనారాయణ తనకు వృద్ధాప్య పింఛన్ ఇప్పించాలని, లక్షెట్టిపేట మండలం పోతపల్లి గ్రామానికి చెందిన ఆవునూరి రాయలింగు తనకు గల భూమి ప్రభుత్వ రికార్డులలో తప్పిపోయిందని, నమోదు చేసి పట్టా ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించే దిశగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంద్రవెల్లి అమరులకు మాజీ ఎంపీ నివాళి



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఇంద్రవెల్లిలోని అమర వీరుల స్థూపం వద్ద మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే, రాజ్ గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు సోయం బాపూరావు నివాళులర్పించారు. సోమవారం ఇంద్రవెల్లి అమరుల స్మృతి చిహ్నం వద్దకు చేరుకున్న ఆయన ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటగా 'రగల్ జెండా'ను ఆవిష్కరించి అమరుల త్యాగాలను స్మరించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఇంద్రవెల్లి కాల్పుల సంఘటన జరిగి నేటికి 45 ఏళ్లు పూర్తయ్యాయని గుర్తు చేశారు. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా అమరుల సంస్మరణ కార్యక్రమాలను నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గత పాలకుల నిర్లక్ష్యంతో ఆదివాసీ ప్రాంతాలు వెనుకబడ్డాయని, ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదిలాబాద్ జిల్లాపై, ముఖ్యంగా ఆదివాసీల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించడం శుభపరిణామమని కొనియాడారు. వచ్చే నెలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాలో పర్యటించనున్నారని, ఆ సమయంలో ఆదివాసీల పెండింగ్ సమస్యలను నేరుగా ఆయన దృష్టి కి తీసుకువెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని సోయం బాపూరావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్, ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షులు ఆత్రం సుగుణ, రాజ్ గోండ్ సేవా సమితి నాయకులు, ఆదివాసీ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆదివాసీలు పాల్గొన్నారు.

# పట్టణ సుందరీకరణకు ప్రత్యేక చర్యలు

- **రూ.3.14 కోట్లతో ఖానాపూర్ చెరువు పునరుద్ధరణకు భూమి పూజ**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ పట్టణ సుందరీకరణలో భాగంగా ఖానాపూర్ చెరువు పునరుద్ధరణ పనులకు మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ శ్రీకారం చుట్టారు. అమృత్–2 పథకంలో భాగంగా పబ్లిక్ హెల్త్ విభాగం ద్వారా కేటాయించిన రూ.3.14 కోట్ల నిధులతో చేపట్టనున్న ఈ పనులకు ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎంపీ గోడం నగేష్తో కలిసి సోమవారం ఆమె భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ ఆదిలాబాద్ పట్టణ రూపురేఖలను మార్చేందుకు తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. పట్టణంలోని 49 వార్డుల సమగ్ర అభివృద్ధి కోసం సుమారు రూ.100 కోట్ల నిధులు త్వరలోనే మంజూరు కానున్నాయని చెప్పారు. ఈ నిధులతో అన్ని వార్డుల్లో నాణ్యమైన బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం, మురుగునీటి పారుదల కోసం నూతన నాళాలు, కాలువల నిర్మాణం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఈ నిధులతో అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఖానాపూర్ చెరువును ఆహ్లాదకరమైన ప్రాంతంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఈఈ అరుణ్ కుమార్, స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** సత్తుపల్లి నియోజకవర్గం వేంసూరు మండలంలోని మర్లపాడు గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సోమవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనందబాబు ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కేంద్రం ప్రారంభంతో స్థానిక రైతులకు తమ పంటను సులభంగా, న్యాయమైన ధరలకు విక్రయించే అవకాశం లభించిందని తెలిపారు. రైతుల సంక్షేమమే తమ ప్రాధాన్యత అని పేర్కొన్నారు. రైతులు మధ్యవర్తులపై ఆధారపడకుండా నేరుగా పంటను విక్రయించే విధంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. భవిష్యత్తులో రైతులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కొనుగోలు కేంద్రం ప్రారంభంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు తమ పంటను తక్కువ ధరలకు అమ్ముకోవాల్సి వచ్చిందని, ఇప్పుడు సరైన మద్దతు ధర లభిస్తుందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కేంద్రం ద్వారా ఆర్థికంగా ఊరట లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పుచ్చకాయల సోమిరెడ్డి, గొర్ల సంజీవరెడ్డి, స్థానిక సర్పంచ్, పీఐసీ విశ్వజిత్, ఏఈఓ ఎస్.సందీప్, ఇంచార్జి రాంపుల్లయ్య, సెక్రటరీ సూర్యప్రకాశ్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# జన్మదినం సందర్భంగా వృద్ధులకు అన్నదానం



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** సత్తుపల్లి నియోజకవర్గం వేంసూర్ గ్రామ సర్పంచ్ మహమ్మద్ ఫక్రుద్దీన్ తనయుడు ఎండి. శంశొద్దీన్ జన్మదిన సందర్భంగా సోమవారం గ్రామంలోని వృద్ధుల శరణాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు అన్నదానం చేసి, వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా శంశొద్దీన్ మాట్లాడుతూ సమాజంలో వృద్ధులను గౌరవించడం ప్రతిఒక్కరి బాధ్యత అని తెలిపారు. జన్మదినాన్ని సేవా కార్యక్రమంతో జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. వృద్ధులు శంశొద్దీన్ను దీర్ఘాయుశ్శు కలగాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు, గ్రామ పెద్దలు, యువకులు, స్థానికులు పాల్గొన్నారు.

